16-9-99

# మాజీ మిలిటెంట్లతో 'ప్రజాస్వామ్య దాస్యం'

**ఒకప్పుడు పీపుల్స్‌వార్‌లో పనిచేసినందుకు ఎన్నికల భద్రతకు ఈ యువకులనుబాధ్యులను చేసి వారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ఎన్నికల ప్రక్రియకు వారిని సజీవమైన సెక్యూరిటీగా వాడుకోవడం చాలా అన్యాయమన్న సంగతి అటుంచి, ఈ పని కేవలం పోలీసులు స్వంత బుద్ధితో చేస్తున్నదేనా?**



కె.బాలగోపాల్

ఆగస్టు 25, వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రం. దాదాపు 300మంది యువకులు ఒక విచిత్రమైన ఊరేగింపు తీస్తున్నారు. వాళ్ళకు ముందు, వెనక కాపలాగా సాయుధ పోలీసులు నడుస్తున్నారు. ఆ సాయుధ పహరాలో నడుస్తున్న యువకులు 'నక్సలిజం నశించాలి' అనీ, 'ప్రజాస్వామ్యం వర్థిల్లాలి' అనీ నినదిస్తున్నారు. అందరూ తప్పక వోటువేయాల్సిందే అని కూడా నినాదం ఇస్తున్నారు.

ఆ యువకులు మాజీ మిలిటెంట్లు. హసన్‌పర్తి మండలంలోని నాగారం, ముచ్చెర్ల, సిద్ధాపురం, వంగపాడు, బైరాన్‌పల్లి, దేవన్నపేట గ్రామాలకుచెందిన వారు.వారు ఆ ఊరేగింపును స్వచ్ఛందంగా తీయడం లేదు. పోలీసుల బలవంతం మీద తీస్తున్నారు. ఒకప్పుడు పీపుల్స్‌వార్ కార్యకర్తలుగా ఉన్నందుకు వారికి ఈ శిక్ష. పీపుల్స్‌వార్‌పిలుపిచ్చిన ఎన్నికల బహిష్కరణ కు వ్యతిరేకంగా వారు ఊరేగింపులు తీయాలి, నినాదాలు ఇవ్వాలి.తమను తామే అపహాస్యం చేసుకుంటూ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి అని నినాదాలు ఇవ్వాలి.


మనుషులను కించపరచడానికి ఇంత కంటె నీచమైన పద్ధతి ఉండదేమో.

కానీ ఈ మాజీమిలిటెంట్లపాట్లు ఇక్కడితో అయిపోలేదు. వరంగల్ జిల్లాలో ఎన్నిక 18 వతేదీన జరుగుతుంది. 16 వ తేదీ సాయంత్రం నుండి ఒక్కొక్క పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ 'మాజీ'లంతా ఆయాపోలీస్ స్టేషన్లు చేరుకోవలసి ఉంటుంది. బ్యాలట్ పెట్టెలకు తోడుగా గ్రామాలకు తిరిగి రావలసి ఉంటుంది. వాటికి కాపలాగా పోలింగ్ జరిగే స్కూళ్లోనే పడుకోవలసి ఉంటుంది. 18 పొద్దున్న అందరికంటే ముందు వారే లైనుకట్టి వోటు వేయాల్సి ఉంటుంది. ఆతరువాత గ్రామస్థులను ప్రోత్సహించి తగు మోతాదులో వోట్లువేయించవలసి ఉంటుంది. పెట్టెలు నిండినంత నిండినాక వాటికి తోడుగా తిరిగి వాటి గమ్యానికి చేర్చవలసి ఉంటుంది.

ఇదంతా జరగబోతున్నదని నేను మీకు 16 వతేదీ పొద్దున్నే చెబుతున్నాను. ఒక్క వరంగల్ లోనే కాదు తెలంగాణాలో పీపుల్స్‌వార్ ప్రభావం ఉన్న అన్ని ప్రాంతాలలోనూ జరగబోతున్నదిదే. ఈ విచిత్రమైన తంతు లేనిదే తెలంగాణాలో ఎన్నికలు పూర్తికావు. ప్రజాస్వామ్యాన్ని ఇంతగా అపహాస్యం చేసే ఈపద్ధతిలో ఎన్నికకావడానికి తమకు అభ్యంతరం ఉందన్న అభ్యర్థి ఒక్కరూ తెలంగాణాలో లేరు. పైగా ఈతంతు మొదలు కావడం కోసం ఎదురు చూస్తూ పోలీస్ స్టేషన్ ఆవరణలో ల్లోం గడుపుతున్న ఈ యువకుల చేతులు పట్టుకొని మీ వోట్లు మాకేవేయండి అంటూఏమీ ఎరగనట్టు ప్రచారం చేసుకుని పోవడం తెలంగాణా రాజకీయ వేత్తలకు అలవాటయింది. ఎంతటి వికారం మధ్యనయినా — అది అలవాటయిపోతే మనుషులు హాయిగా బతికేయగలరనడానికి ఇది ఒక నిదర్శనం మాత్రమే.

ఒకప్పుడు పీపుల్స్‌వార్‌లో పనిచేసినందుకు ఎన్నికల భద్రతకు ఈ యువకులను బాధ్యులను చేసి వారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ఎన్నికల ప్రక్రియకు వారిని సజీవమైన సెక్యూరిటీగా వాడుకోవడం చాలా అన్యాయమన్న సంగతి అటుంచి, ఈ పని కేవలం పోలీసులు స్వంత బుద్ధితో చేస్తున్నదేనా? హైదరాబాద్‌లో కూర్చొని శ్రప్రజాస్వామ్యాన్ని గురించి నాజూకుగా మాట్లాడే చీఫ్ ఎలెక్షన్ ఆఫీసర్‌గారికి, దేశం మొత్తం మీద ప్రజాస్వామ్యానికి ప్రమాణ నిర్ణేతలుగా తమను తాము భావించాలనుకుంటున్న ఎన్నికల కమిషనర్‌లకు ఈ విషయం తెలీదా? లేక ఇది వారి పాలసీయేనా?

ఎవరి బుర్రలో పుట్టిందో గానీ ఇదిప్పుడు భారత ప్రజాస్వామ్యంలో భాగమైన పాలసీ ఎందుకంటే మిలిటెన్సీ ఉన్న అన్ని ప్రాంతాలలోనూ ఆ మిలిటెన్సీ నుండిప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి మాజీ మిలిటెంట్లనూ, సానుభూతి పరులనూ సెక్యూరిటీగా వాడుకోవడం వివిధ రూపాలలో సాగుతూనే ఉంది. ఒకరి రాజకీయ భావాలకు వారికి ఈ రకమైన శిక్ష వేయడం ఇది భౌతికశిక్ష మాత్రమే కాదు, మనస్సులను కించపరిచే శిక్ష. చాలా అనాగరిక మైన చర్య. కానీ భారతప్రజాస్వామ్యానికిది అవసరమని మన ప్రజాస్వామ్య రక్షకులు భావిస్తున్నారు.కాదని చెప్పడానికి ఈ ప్రజాస్వామ్యం సృష్టించిన నాయకులెవరికీ ధైర్యం చాలదు.



నాగరికం, అనాగరికం అటుంచి దీనివల్ల ఒనగూడే ఫలితమేమిటి? మిలిటెంట్ల దాడి నుండి బ్యాలట్ పెట్టెలను వాటికి కాపలాగా వ్యవహరించే పోలీసులనూ కాపాడటానికి ఇది ఉపయోగపడుతున్నట్టుంది. అదేలక్ష్యమైతే కొంతఖర్చయితే అయింది గానీ పెట్టెలకు ఏర్పాటు చేసే పోలీసు పహారాను పెంచడం సరయిన పద్ధతి అవుతుంది గానీ ఈ అమానుషత్వం కాదు.

ఇంక వేరే ఏఫలితం ఒనగూడుతుంది? ఇదంతా చేయకపోతే ప్రజలు వోట్లు వెయ్యరా? ఈ ప్రశ్నకు కచ్చితంగా జవాబు చెప్పాలంటే ఇటుమిలిటెంట్లు అటు భద్రతాదళాలు ఈ బలవంతపు బహిష్కరణ, బలవంతపు ప్రజాస్వామ్యం అనే ప్రహసనానికి ఒక్కసారైనా సెలవు ఇయ్యవలసి ఉంటుంది. అంతవరకు ఊహించడం తప్ప ఏమీ చేయలేము.

నక్సలైట్ ప్రభావిత ప్రాంతాలలో కంటే భారత రాజ్యంపట్ల చాలారెట్లు ఎక్కువ ద్వేషం ఉన్న కాశ్మీర్‌లో సహితం పట్టణాలలో అందులోనూ రాష్ట్రరాజధాని శ్రీనగర్‌లో అమలయినంత విజయవంతంగా గ్రామీణ ప్రాంతాలలో మిలిటెంట్ల బహిష్కరణ పిలుపు అమలు కావడంలేదు. వోటు వేయవలసిందేనని సైన్యం పెట్టే ఒత్తిడి ఒక క్రూరమైన సత్యమే అయినప్పటికీ అదొక్కటే దానికి కారణం కాదు. తెలంగాణాలోనయితే 1996 పార్లమెంట్ ఎన్నికలలో ఇటు 'అన్న'లు గానీ అటుపోలీసులు గానీ ఎవరిపైనా పెద్దగా ఒత్తిడి పెట్టలేదు. కానీ వోట్లు బాగా పడడమే కాక నక్సలైట్ల ప్రభావం బలంగా ఉన్న కరీంనగర్ గ్రామాలలో సైతం బిజెపి అభ్యర్థికి కుప్పలుగా వోట్లు పడ్డాయి.

అన్ని రాజకీయ పార్టీల పట్ల తమ నిరసనను వ్యక్తంచేయడం కోసం ఒక పరిమిత ప్రాంతంలో ప్రజలే ఎన్నికలను బహిష్కరించిన ఉదంతాలు చాలా ఉన్నాయిగానీ సైద్ధాంతిక బహిష్కరణ ఎప్పుడూ పెద్దగా విజయవంతం కాలేదు. సాయుధ పోరాట రాజకీయవాదులకు ఎన్నికల ప్రక్రియ 'రాజ్యం' లో భాగంగా కనిపిస్తుంది గానీ ప్రజలకది రాజ్యాన్ని ప్రభావితంచేయడానికి తమకు అందుబాట్లో ఉన్న ఒకసాధనంగా కనిపించడం దీనికొక ముఖ్యకారణమేమో.

దురదృష్టవశాత్తు, ఇందులో ఏ వైఖరి ఎంతవరకు సత్యమన్న సున్నితమైన వివేచనకు తావు లేని భయ వాతావరణం ఎన్నిక లొచ్చినప్పుడల్లా తెలంగాణాలో నెలకొంటుంది. ఎన్నికలలో చర్చకు రావలసిన విషయాలు తెలంగాణాలో చాలా ఉన్నాయి. దక్షిణ భారతదేశంలోని అతి పెద్ద నదులయిన కృష్ణ, గోదావరి నదులు తెలంగాణాలో సుదీర్ఘంగా ప్రవహిస్తాయి. అయినప్పటికీ గోదావరి బేసిన్‌లోనూ, కృష్ణా బేసిన్‌లోనూ కూడా కరవుపీడిత ప్రాంతాలున్నాయి. తెలంగాణాలో సారవంతమైన భూములున్నాయి, అడవులున్నాయి, పారిశ్రామిక వినియోగంలో ఉన్న రాయి ఉంది, బొగ్గు ఉంది. అయినా పారిశ్రామిక అభివృద్ధి లేదు. సింగరేణి బొగ్గు గనులు ఉపాధి కల్పన విషయంలో కుంచించుకు పోయే పరిస్థితి ఏర్పడింది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని మూసేయబోతున్నారు. వరంగల్‌లోని అజంజాహీ మిల్లు రేపోమాపో అన్నట్టు ఉంది. 'సామాజిక అభివృద్ధి' సూచికలు ఏవి తీసుకున్నా తెలంగాణా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలోకీ వెనుకబడి ఉందన్న విషయం తేలుతుంది. అధికంగా ఆదివాసీలు నివసించే ఆదిలాబాద్ జిల్లా గడచిన సంవత్సరం ప్రాణాంతకమైన రోగాల ఉప్పెనను చూసింది.

ఈ సమస్యల చర్చ లేని ఎన్నికలు జరుపుకోవడం వృథా: నాయకులు చేయకపోతే ప్రజలయినా చేయాలి. ఈ చర్చల ప్రాతిపదికన ఎన్నికలు జరగాలి. అట్లా జరిగే ఎన్నికలలో ప్రజలు మనస్ఫూర్తిగా వోటు వేసిన ఫరవాలేదు, వేయనక్కర లేదనుకున్నా ఫరవాలేదు.

కానీ దీనికి ప్రశాంతి కావాలి. గ్రామాలకు పోవాలంటే నాయకులకు భయం, వాళ్ళొచ్చినప్పుడు 'ఏమైనా' జరిగితే ఆ తరువాత పోలీసు లొస్తారేమోనని ప్రజలకు భయం. ఈ భయాలు నిండిన వాతావరణంలో ఆ చర్చ, సంవాదం సాధ్యం కావు. ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించిన నాయకులను చూపించి ఈ వాతావరణాన్ని ఒకరు సమర్థించవచ్చు. కానీ నష్టపోయేది ప్రజలు, నష్టపోయేది తెలంగాణా. ఏ ఒక్క సమస్య మీద ఏ ఒక్క పార్టీ నుండీ ఏ ఒక్క అభ్యర్థి నుండీ ఒక కచ్చితమైన హామీ పొందకుండా ఒక అవగాహన ఏర్పడకుండా, హింసాభయాల మధ్య, వికారమైన పోలీసు నిర్బంధం మధ్య తెలంగాణాలో ఎన్నికలు గడచిపోతాయి. వోట్లడగడానికి వచ్చిన నాయకులను ప్రజలు నిలదీసి ఇబ్బంది పెట్టిన కొన్ని ఘటనల గురించి తెలంగాణాలో వింటుంటాం. కానీ ఎక్కువ భాగం గ్రామాలకు ఏ నాయకులూ పోరు, ఎవ్వరి స్థానిక కార్యకర్తలూ పెద్దగా ప్రచారం చేయరు. నిశ్శబ్దంగా, భయంగా ఎన్నికలు జరిగిపోతాయి.

సరిగ్గా ఎన్నికలకు ముందే పీపుల్స్‌వార్ మూడు వేర్వేరు ఘటనలలో పోలీసులను హతమార్చడం ఈ భయ వాతావరణాన్నీ, అశాంతినీ పెంచడానికే తోడ్పడుతుంది. ప్రస్తుత రాజకీయ వ్యవస్థను తమ శత్రువుగా భావించే ఆ పార్టీ దృష్టిలో ఈ చర్యలు ఆ వ్యవస్థకు కీలకమైన ఎన్నికలఘట్టాన్ని సంక్షోభంలో పడేసే చర్యలుగా, వ్యూహాత్మకంగా అర్థవంతమైన చర్యలుగా కనిపించవచ్చు. దాని మంచిచెడులు బేరీజువేసే ముందు దాని ఫలితాన్ని స్పష్టంగా గుర్తించడం అవసరం. అశాంతి, భయం, పోలీసులలో మరింత ఆగ్రహం, దాని ఫలితం ఎంత క్రూరంగా ఉంటుందో అని ప్రజలలో ఉద్విగ్నత —ఇవి ప్రజల సమస్యల చర్చకుగానీ, పరిష్కార ప్రతిపాదనకుగానీ, అర్థవంతమైన రాజకీయ నిర్ణయాలకు గానీ తోడ్పడే వాతావరణం కాదు. ఈ గడ్డుకాలం ఎంత త్వరగా గడచిపోతే అంత బాగుండునని కోరుకుంటూ సెప్టెంబర్ 19 తెల్లవారడం కోసం ఆతృతతో ఎదురు చూసే వాతావరణం. నాయకులు అర్థరహితంగా మార్చిన ఎన్నికల వ్యవస్థను ఇంకొంత అర్థరహితంగా తయారుచేసే వాతావరణం.

పోలీసు యంత్రాంగానికి ఇదే అదను. తమ ప్రాముఖ్యం ఎంత పెరిగితే, తమ పాత్ర ఎంత పెరిగితే వారికంత సంతోషం. ఎన్నికలన్నా ప్రజాస్వామ్యానికి సంబంధించిన ఏ ప్రక్రియ అన్నా వారికున్నంత చులకనభావం ఎవ్వరికీ ఉండదు. తమ తుపాకీ నెలకొల్పే భద్రత మీద మాత్రమే వారికి నమ్మకం. నక్సలైట్లను ఎదుర్కొనడానికి 'ప్రజాస్వామ్యం' అన్న మాట వారికి పనికొచ్చింది. ఎన్నికలమీద గౌరవం ప్రదర్శించడం అక్కరకొచ్చింది కానీ ప్రజల అభీష్టానికి స్థానం కల్పించడం ద్వారా సార్థకత పొందే రాజకీయ ప్రక్రియ లంటే నిజానికి వారికి అమితమైన చులకన.

అందుకే యువకులను బలవంతంగా పోగుచేసి అన్నం, నీళ్ళు లేకుండా ఊరేగింపులు తీయిస్తూ 'ప్రజాస్వామ్యం వర్థిల్లాలి' అంటూ నినాదాలు ఇప్పించగలరు. ఎవరికి వోట్లు వేయడం ఇష్టం లేదనుకుంటారో వారి చేతనే మొదటి వోట్లు వేయించి, ఊరందరి చేత వోట్లు వేయించే బాధ్యత వారికే అప్పగించగలరు. మనుషులన్నా, వారి అభిప్రాయాలన్నా, వారి ఆత్మాభిమానమన్నా ఇంతటి చులకనభావం ఉన్న యంత్రాంగం పైన ఆధారపడి ఎన్నికల వ్యవస్థను 'అన్నల' నుండి కాపాడాలని చూసే నాయకులను అనాలి!